లగచర్ల రైతుకు సంకెళ్లు

మొదటిపేజీ తరువాయి...

టెస్టులు కూడా చేయించారు. అన్నంపెట్టే రైతుకే సంకెళ్లు వేసి దవాఖానకు తరలించిన అమానవీయ ఘటనపై బీఆర్ఎస్ నాయకులు, గిరిజన, రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

రైతులపై కక్ష తీరని కాంగ్రెస్ సర్కార్

లగచర్ల గిరిజన రైతులను నెలరోజుల పాటు జైలులో పెట్టి హింసించినా రేవంత్ సర్కార్‌కు ఇంకా కక్ష తీరినట్టు కనిపించడం లేదు. జైలులో గుండె నొప్పి వచ్చిన గిరిజన రైతు హీర్యానాయక్(44)కు వైద్యం అందించడంలోనూ పట్టింపులేకుండా వ్యవహరించింది. అంతటితో ఆగకుండా గుండెనొప్పితో బాధపడుతున్న హీర్యానాయక్‌కు సంకెళ్లు వేసి దవాఖానకు తరలించి తన క్రూరత్వాన్ని చాటుకున్నది. సంగారెడ్డి జిల్లా కంది జైలులో గుండెపోటుతో బాధపడుతున్న లగచర్లలోని పులిచర్లకుంటతండాకు చెందిన హీర్యానాయక్‌ను అంబులెన్స్‌లో కాకుండా బేడీలతో పోలీసు జీపులోనే గురువారం సంగారెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు తరలించింది. ఎలాంటి ఎస్కార్ట్స్ లేకుండా, వైద్య సిబ్బంది లేకుండా జైలు వాహనంలో అధికారులు హీర్యానాయక్‌ను బేడీలతో దవాఖానకు తీసుకొచ్చారు. గండెనొప్పితో తల్లడిల్లిపోతూ దవాఖాన బెడ్‌పై మెలితిరుగుతున్నా సంకెళ్లు తొలగించలేదు. మానవీయతను చాటుకోవాల్సిన జైలు అధికారులు, పోలీసులు బేడీలు తీయకుండానే వైద్య పరీక్షలు చేయించారు. వైద్యులు ఈజీసీ, 2డీ ఈకో టెస్టులు చేస్తున్న సమయంలోనూ హీర్యానాయక్‌కు సంకెళ్లను తీయలేదంటే అన్నంపెట్టే రైతుపట్ల రేవంత్ సర్కార్ ఎంత దుర్మార్గంగా వ్యవహరించిందో అర్థం చేసుకోవచ్చు!

రెండు రోజులుగా బాధపడుతున్నా..

లగచర్ల ఘటనలో రిమాండ్ అయిన హీర్యానాయక్‌కు కంది జైలులోనే బుధవారం మధ్యాహ్నం స్వల్పంగా గండెనొప్పి వచ్చింది. దీంతో జైలు వైద్యులు పరీక్షలు చేశారు. అక్కడే ఈసీజీ తీసి చికిత్స కోసం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ వైద్యశాలకు తరలించారు. సంగారెడ్డి దవాఖానలో ఈసీజీ ఇతర పరీక్షలు చేసిన వైద్యులు మందులు రాసి పంపించారు. బుధవారం రాత్రి మరోమారు హీర్యానాయక్‌కు గండెనొప్పి రావటంతో తిరిగి సంగారెడ్డి దవాఖానకే తీసుకురాగా వైద్యులు చికిత్స చేసి పంపించారు. గురువారం ఉదయం హీర్యానాయక్ గండెనొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. జైలు సిబ్బంది అతడిని అంబులెన్స్‌లో కాకుండా జైలు వాహనంలోనే చేతికి బేడీలు వేసి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో వైద్యులు అశోక్, మజీద్‌ఖాన్ ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేయగా ఆసమయంలోనూ రైతుకు బేడీలు తీయలేదు. పరీక్షలు ముగిసిన తర్వాత మెరుగైన చికిత్స కోసం పంజాగుట్టలోని నిమ్స్‌కు తరలించాలని సూపరింటెండెంట్, వైద్యులు నిర్ణయం తీసుకున్నారు. హీర్యానాయక్ చాలారోజులుగా ఛాతి నొప్పితో బాధపడుతున్నట్టు వైద్యులు తెలిపారు. 2డీ ఈకో పరీక్ష చేయగా గుండె బలహీనంగా ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. సంగారెడ్డిలో కాథల్యాబ్ లేనందున నిమ్స్‌కు రిఫర్ చేయాలని నిర్ణయించినట్టు వివరించారు.

అండర్ ట్రయల్ ఖైదీలకు సంకెళ్లా?

అండర్ ట్రయల్‌లో ఉన్న ఖైదీలకు సంకెళ్లు వేయవద్దని గతంలో కోర్టులు చెప్పినా అవేమీ పట్టించుకోండా కంది సెంట్రల్ జైలు పోలీసులు హీర్యానాయక్‌కు సంకెళ్లు వేసి దవాఖానకు తరలించటం తీవ్ర విమర్శలకు దారితీసింది. జైలు అధికారుల తీరును గిరిజన, రైతు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఓ రైతుకు, అదీగాక గుండెపోటుతో బాధపడుతున్న అన్నదాతకు సంకెళ్లు వేసి దవాఖానకు తీసుకురావడంపై బీఆర్ఎస్ నాయకులు నిప్పులుచెరిగారు. సంగారెడ్డి దవాఖానలో హీర్యానాయక్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కాంగ్రెస్ సర్కార్ తీరుపై ధ్వజమెత్తారు. ఈ ఘటనపై అన్నివర్గాల నుంచి ఆగ్రహావేశాలు, విమర్శలు వెల్లువెత్తడంతో జైలు అధికారులు, పోలీసులు తప్పు సవరించుకుని హీర్యానాయక్‌ను మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తరలించే సమయంలో సంకెళ్లను తొలగించారు.

హీర్యానాయక్ చేతికి బేడీలు వేసి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చిన జైలు సిబ్బంది

ఎన్ని తిప్పలుపెట్టినా భూములు ఇవ్వం : రూప్లానాయక్

'నా కొడుకు హీర్యానాయక్ ఏమైనా దొంగనా? గండెనొప్పితో బాధపడుతున్న నా కొడుకును బేడీలతో ఎట్లా దవాఖానకు తీసుకొస్తరు? గుండె నొప్పి వచ్చినా మాకు చెప్పరా' అని జైలు అధికారులు, పోలీసులపై తండ్రి రూప్లానాయక్ తీవ్రంగా మండిపడ్డారు. 'నా బిడ్డను అన్యాయంగా అరెస్టు చేసి జైల్లో పెట్టింద్రు. ఆని చేతికి బేడీలు చూస్తే గుండె తరుక్కుపోయింది' అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. హీర్యానాయక్‌ను నిమ్స్‌కు తరలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఫార్మాకంపెనీకి భూములు ఇవ్వనందుకు తన కొడుకుపై అక్రమంగా కేసులు పెట్టి జైలులో వేశారని కన్నీరుమున్నీరయ్యారు. 'కలెక్టర్‌పై దాడి జరిగిన రోజు నా కొడుకు అక్కడ లేనేలేడు. ఆలుమొగలిద్దరూ కొస్గికి పనికి పోయింద్రు. పోలీసులు దొంగల్లా అర్ధరాత్రి ఒంటిగంటకు వచ్చి లైట్లు బందు పెట్టి నాకొడుకును పట్టుకపోయింద్రు. నన్ను నిద్రలేని నీ వయస్సెంత అని అడిగితే 70 ఏండ్లు అని చెప్పిన. ముసలోన్నని నన్ను పట్టుకపోలే కావచ్చు. నేను రేవంత్‌రెడ్డి కోసం కొట్లాడిన. మా తండా నుంచి వంద ఓట్లు చేతిగుర్తుకు వేయించిన. ఆ పాపానికి మా పచ్చని పొలంలో రేవంత్ రెడ్డి చిచ్చుపెట్టిండు. నా కొడుకు బిడ్డది నిశ్చితార్థం పెట్టుకున్నం. ఈ టైంల నా కొడుకును జైల్లో పెడుతవా రేవంత్‌రెడ్డీ? హీర్యానాయక్‌కు ఏమైనా జరిగితే సీఎం రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డిదే బాధ్యత. వాళ్ల ఇండ్ల ముందు బైటాయించి ఆందోళన చేస్తం. నా కొడుకును వదలకపోతే రేవంత్‌రెడ్డి ఇంటి ముందట కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటం' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.

తల్లిదండ్రులు కలవకుండా అడ్డగింత

హీర్యానాయక్‌కు గండెనొప్పి వచ్చిన విషయం తెలుసుకున్న భార్య దేవీబాయి, తండ్రి రూప్లానాయక్, తల్లి లచ్చిమిబాయి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు వచ్చారు. వారివెంట లాయర్ రాంచందర్ ఉన్నారు. హీర్యానాయక్‌ను కలిసేందుకు వారు ప్రయత్నించగా గదిబయటనే పోలీసులు అడ్డుకున్నారు. కుటుంబ సభ్యులను అడ్డుకోవడంపై అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకుడు జైపాల్‌నాయక్, లాయర్ రాంచందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హీర్యానాయక్‌ను కలిసేందుకు కుటుంబసభ్యులను అనుమతించాలని, లేదంటే ఆందోళనకు దిగుతామని జైపాల్‌నాయక్ హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసులు, జైపాల్‌నాయక్ మధ్య వాగ్వాదం జరిగింది. చివరికి హీర్యానాయక్‌ను కలిసేందుకు ఆయన భార్య దేవీబాయి, లాయర్ రాంచందర్‌ను అనుమతించారు. ఇద్దరూ పది నిమిషాలపాటు హీర్యానాయక్‌తో మాట్లాడారు. చక్రాలకుర్చీపై తరలిస్తున్న క్రమంలో కొడుకును చూసిన రూప్లానాయక్, లచ్చిమిబాయి కన్నీరుమున్నీరయ్యారు. భార్య దేవీబాయి సైతం పెద్దపెట్టున రోదించింది. తన కొడుక్కు ఇలా అవడానికి సీఎం రేవంత్‌రెడ్డే కారణమని రూప్లానాయక్ ఆవేదన వ్యక్తంచేశాడు. హీర్యానాయక్‌కు ఏదైనా జరిగితే రేవంత్‌రెడ్డి, ఆయన అన్న తిరుపతిరెడ్డే బాధ్యులని శాపనార్థాలు పెట్టాడు. అంబులెన్స్‌లో హీర్యానాయక్ వెంట తామూ వస్తామని కుటుంబ సభ్యులు పట్టుబట్టగా జైలు సిబ్బంది, పోలీసులు నిరాకరించారు. చివరకు లాయర్ రాంచందర్ ఒత్తిడి మేరకు భార్య దేవీబాయి ఒక్కరినే అనుమతించారు.

హీర్యానాయక్ ఆరోగ్యం నిలకడగా ఉంది : నిమ్స్ వైద్యులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబరు 12 (నమస్తే తెలంగాణ): హీర్యానాయక్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని నిమ్స్ వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం కార్డియో విభాగంలో అతడికి చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించామని, ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగానే ఉన్నదని స్పష్టం చేశారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ

నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న హీర్యానాయక్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. ఘటనపై సీఎం దృష్టికి తీసుకెళ్లి కేసులు ఎత్తివేయిస్తామని హామీ ఇచ్చారు. కమిషన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. అధికారులపై దాడి సమయంలో తాను లేనని, అమాయకుడినైన తనను అక్రమంగా అరెస్టు చేశారని బాధిత రైతు హీర్యానాయక్ కమిషన్ చైర్మన్‌కు విన్నవించారు. భయంతోనే ప్రాణం పోయేలా ఉన్నదని, కేసులు ఎత్తివేసి తన ప్రాణాలు కాపాడాలని వేడుకున్నారు. రైతును పరామర్శించిన వారిలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, అధికారులు ఉన్నారు.

ఎక్కడున్నాడో చెప్పకుండా హైరానా

హీర్యానాయక్‌కు గుండె పోటు వచ్చిన విషయాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు చెప్పకపోవడంతో తల్లిదండ్రులు, తోబుట్టువులు, బంధువులు అంతా ఆందోళన చెందారు. సోషల్ మీడియాలో హీర్యా నాయక్‌కు గుండెపోటు అనే విషయం తెలుసుకొని తమ బిడ్డకు ఏమైంది? ఏ దవాఖానలో ఉన్నాడు? అంటూ సమాచారం కోసం ఎంత ప్రయత్నించినా పోలీసులు చెప్పలేదు. ఓ సారి కోస్గి దవాఖానలో ఉన్నాడని, మరోసారి ఉస్మానియా దవాఖాన అని, ఇంకోసారి గాంధీలో ఉన్నాడని సమాచారం వస్తుండటంతో వాళ్లంతా ఆయా దవాఖానల చుట్టూ తిరిగి అలిసిపోయారు. చివరికి హీర్యానాయక్ నిమ్స్‌లో ఉన్నాడని తెలిసి అక్కడికి చేరుకున్నారు.

జైళ్లేసుడుకే గుండె నొప్పి వచ్చింది

ఏం జెప్పాలె సారూ. మావోనికి గుండె నొప్పి లేకుండె. ఆరోజు పొద్దాడసంటీ పనిజేసి వచ్చిండు. ఇంట్ల పండుకున్నడు. ఒక్కటిగొట్టంగ పోలీసులు వచ్చి పట్టుకొని బస్సుల వేసింద్రు. మమ్మల్నీ కొట్టడానికి వచ్చింద్రు. అద్దాలన్నీ పగలగొట్టింద్రు. నా కొడుకును అన్యాయంగ జైల్ల ఏసినందుకే గండె నొప్పి వచ్చింది. మేము భూమి ఇయ్యం.. ఏమియ్యం.. మా కొడుకుని ఇంటికి తోలియ్యాలె. జైలుకు భయపడం. మా పిల్లగానికి ఏమన్న జరిగిందో.. సూడుర్రి..

- లచ్చిమీ బాయి, హీర్యా నాయక్ తల్లి



సంగారెడ్డి జిల్లా దవాఖాన వద్ద మీడియాతో మాట్లాడుతున్న లాయర్ రాంచందర్

మానవతా దృక్పథంతో బెయిల్ ఇవ్వాలి : రాంచందర్, లాయర్

హీర్యానాయక్‌కు బేడీలు వేసి దవాఖానకు తీసుకురావటం ఏమిటని వికారాబాద్‌కు చెందిన లాయర్ రాంచందర్ ప్రశ్నించారు. సంగారెడ్డి ప్రభుత్వ దవాఖాన ఎదుట ఆయన మాట్లాడుతూ లగచర్ల రైతుల పక్షాన తాను వాదిస్తున్నట్టు చెప్పారు. జైలు అధికారులు, పోలీసులు ఓవరాక్షన్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. భూములు ఇవ్వని రైతులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించారు. రిమాండ్‌లో ఉన్న రైతులకు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేస్తే మా జ్యూరిడిక్షన్ కాదని వికారాబాద్ కోర్టు తెలిపిందని, బెయిల్ అంశం స్పెషల్‌కోర్టు హైదరాబాద్‌లో ఉందని చెబితే అక్కడికి వెళ్లినా మా జ్యూరిడిక్షన్ కాదని చెప్పారని, దీంతో హైకోర్టును ఆశ్రయించగా బెయిల్ ఫైల్ హైకోర్టు ముందుకు వస్తుందని చెప్పినట్టు వివరించారు. మానవతా దృక్పథంతో కోర్టు హీర్యానాయక్‌తో పాటు ఇతర రైతులకు బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఫార్మా విలేజ్‌ను రద్దు చేసిన నేపథ్యంలో రైతులపై ఉన్న కేసులను రద్దు చేయాలని కోరారు. గిరిజన నాయకుడు జైపాల్‌నాయక్ మాట్లాడుతూ గుండెనొప్పితో బాధపడుతున్న గిరిజన రైతును ఏదో దేశద్రోహిలా బేడీలతో దవాఖానకు తీసుకురావటం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే గిరిజన రైతులపై కేసులు ఎత్తివేయాలని, హీర్యానాయక్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

మరో ఇద్దరికి అనారోగ్యం.. ఎమ్మెల్యే పరామర్శ

లగచర్ల ఘటనకు సంబంధించి 24 మందికిపైగా రైతులు సుమారు నెల నుంచి కంది జైలులో ఉన్నారు. వీరిలో కొందరు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. హీర్యానాయక్ గుండెనొప్పితో బాధపడుతుండగా మరో ఇద్దరు రైతులు రాఘవేందర్, బసప్ప అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు. బసప్ప గుండెసంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారు. రాఘవేందర్ చలి జ్వరంతో బాధపడుతుండగా వీరికి జైలులోనే చికిత్స అందిస్తున్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం మధ్యాహ్నం జైలులో బసప్ప, రాఘవేందర్‌ను కలిసి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. తమకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని వారు కన్నీరు పెట్టడంతో ఎమ్మెల్యే జైలు అధికారులతో మాట్లాడారు. గొండెనొప్పితో బాధపడుతున్న హీర్యానాయక్‌ను బేడీలతో దవాఖానకు తరలించడం దారుణమని మండిపడ్డారు. న్యాయం కోసం పోరాటం చేస్తే సంకెళ్లు వేస్తారా? అని నిలదీశారు.

సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానలో హీర్యానాయక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

లోకం పోకడ

పిల్లలు డాక్టర్లో, ఇంజినీర్లో అవుతారని స్కూళ్లకు పంపితే పేషెంట్లు అవుతున్నారు దేవుడా!

ఉగ్రవాదా? దోపిడీ దొంగనా?

రైతన్న చేతికి బేడీలు వేస్తరా? : హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): 'రైతు హీర్యానాయక్ ఉగ్రవాదా? లేక దోపిడీ దొంగనా? రైతుల పట్ల ఎందుకు ఇంత కర్కశంగా వ్యవహరిస్తున్నరు' అని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. 'దేశానికి అన్నం పెట్టే రైతన్న చేతికి బేడీలు వేస్తారా? రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నం. అనారోగ్యంతో బాధపడుతున్న లగచర్ల రైతుకు బేడీలు వేసి దవాఖానకు తీసుకువెళ్లడం హేయమైన చర్య.. ఇంత కంటే దారుణం ఏముంటుంది' అని గురువారం ఎక్స్‌వేదికగా మండిపడ్డారు. 'వాళ్ల భూములనే గుంజుకుంటరు. తిరిగి వాళ్లనే అరెస్టులు చేస్తరా? రేవంత్‌రెడ్డీ.. ఇదేనా మీ ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా మీ ప్రజాపాలన? ముమ్మాటికీ మీది ప్రజాకంటక పాలన. రైతు కంటక పాలన' అని నిప్పులు చెరిగారు.

లగచర్ల రైతుకు సన్మానమిదా ?

ఇందిరమ్మ రాజ్యం అంటే రైతన్నకు బేడీలు వేసుడా? గుండెపోటు వచ్చిన రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తీస్కపోతరా? రైతుకు గుండె నొప్పి వచ్చినా ఈ పాలకుల గుండె కరగలేదా? ఫార్మాక్లస్టర్ పేరిట గిరిజన తండాల్లో మంటలు రాజేసి ఎదురు తిరిగిన రైతుల మీద అక్రమ కేసులు బనాయిస్తరా? అర్ధరాత్రి ఇండ్ల మీద పడి ఆడబిడ్డలను వేధిస్తరా? భూమిని నమ్ముకొని అందరికీ బువ్వ పెట్టే రైతుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం చూపే ప్రేమ ఇదేనా?

– నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి

రాజ్యాంగ ఉల్లంఘనే

పోలీసు కస్టడీలో ఉన్న లగచర్ల గిరిజన రైతు హీర్యానాయక్‌ను అమానవీయంగా, అక్రమంగా బంధించడం మానవ గౌరవానికి భంగం కలిగించడమే కాకుండా రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే! దేశంలో ఎక్కడైనా జైలులో ఉన్నప్పుడు, ప్రయాణం సందర్భంగా ఖైదీలకు సంకెళ్లు వేయడాన్ని సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా ఖండించింది. తెలంగాణ పోలీసులు గూండాలు, డెకాయిట్ల మాదిరిగా చట్టాన్ని ఎందుకు ఉల్లంఘిస్తున్నారో అర్థం కావడంలేదు.

– దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ నేత

అడ్డంగా డబ్బులు పంచుతూ దొరికిన దొంగనా?

హీర్యానాయక్ ఏమన్న తీవ్రవాదా? ఉగ్రవాదా? లేక అడ్డంగా డబ్బులు పంచుతూ దొరికిన దొంగనా? ప్రజలకు పట్టెడన్నం పెట్టే రైతన్నకు బేడీలు వేయడమే ప్రజాపాలనా? ఇదే ఇందిరమ్మ రాజ్యమా? గుండె నొప్పితో బాధపడున్నా చూడకుండా బేడీలు వేసి దవాఖానకు తీస్కపోతరా? 30 రోజులుగా జైల్లో మగ్గుతున్న 45 మంది లగచర్ల రైతులపై సీఎం కనీసం కనికరం చూపించడం లేదు.

– కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్

సంకెళ్లు వేయాల్సిందెవరికి?

రైతుల భూములు గుంజుకోవాలని చూసి తిరిగి వారిపైనే కేసులు పెడుతరా? అసలు సంకెళ్లు వేయాల్సింది రైతుకా? రేవంత్‌కా? ఫార్మా విలేజ్ కోసం భూములు లాక్కోవాలని చూసింది సీఎం రేవంత్‌రెడ్డి. రైతులతో కనీసం చర్చలు జరపకుండా అధికారులను పంపింది రేవంత్‌రెడ్డి. పోలీసులతో దాడి చేయించి ఫార్మా విలేజ్ ప్రతిపాదనను రద్దు చేసుకున్నదీ రేవంత్‌రెడ్డి. ఇందులో రైతుల తప్పేమున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు ఇది నిదర్శనం.

– వై సతీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్

ప్రభుత్వానిదే బాధ్యత

ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహనాయక్

రవీంద్రభారతి, డిసెంబర్ 12 : లగచర్ల గిరిజన రైతులకు ఏదైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహనాయక్ హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

లగచర్ల రైతుల కేసు నాంపల్లి కోర్టుకు బదిలీ

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): లగచర్ల రైతులపై బొమ్రాస్‌పేట్ పోలీసులు నమోదు చేసిన కేసు విచారణను హైకోర్టు నాంపల్లి ప్రత్యేక కోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఇప్పటివరకు సంగారెడ్డి జైలులో వారు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఈ కేసులో నిందితునిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రెండ్రోజుల పోలీసు కస్టడీ ముగియడంతో ఆయన బెయిల్‌పై విచారణ ప్రారంభం కానుంది.

మమ్ముల్ని బతుకనివ్వండి

- నా తమ్ముడికేమన్నయితే మాకు దిక్కెవరు?
- రేవంత్‌రెడ్డి సీఎం అయితే మా బతుకులు బాగైతయనుకున్నం..ఇట్ల చేస్తడనుకోలే..
- సెంటు భూమి కూడా ఇచ్చేది లేదు
- హీర్యానాయక్ అక్క శాంతిబాయి ఆవేదన

కొడంగల్, డిసెంబరు 12 : నా తమ్ముడు ఏనాడూ ఎవరికీ ఎటువంటి కీడూ చెయ్యలే. మా తల్లిలాంటి భూమిని మాకు కాకుండ చెయ్యాలని చూస్తే ప్రశ్నించిండు. ఇద్దరు ఆడబిడ్డల నడుమ ఒక్కడే మాకు. వానికి చిన్న పిల్లలున్నరు. నా తమ్ముడికి ఏమన్న జరిగితే మేమంత ఎట్ల బతుకుడు?' అని హీర్యానాయక్ సోదరి శాంతిబాయి ఆవేదన వ్యక్తంచేసింది. భూమినే నమ్ముకొని బతుకుతున్నామని, భూమి పోతే తమకు ఏ అధారం లేదని కన్నీటిపర్యంతమైంది. తన తమ్ముడికి హఠాత్తుగా గుండెపోటు వచ్చిందని తెలిసి పులిచెర్లకుంటతండాలో ఉన్న శాంతిబాయి తీవ్రంగా రోదించింది. లగచర్ల ఘటనలో తన తమ్ముడిని పోలీసులు పట్టుకుపోయారని, 15 రోజుల్లో ఇంటికి వస్తడన్నారని, తన కోసం పిల్లలు ఏడుస్తూ ఎదురుచూస్తున్నారని కన్నీళ్లు పెట్టుకుంది. 'సీఎంకు ఫ్యాక్టరీలు పెట్టుకోవాలంటే మా పేదల భూములే కావాల్నా? ఎకరం, రెండు ఎకరాల్లో పంటలు పండించుకొని మా మానాన మేము బతుకుతున్నం. సెంటు భూమి కూడా వదులుకునేది లేదు. రేవంత్‌రెడ్డి సీఎం అయితే మా బతులు బాగైతయనుకున్నం. ఇట్ల చేస్తడని కలలో కూడా అనుకోలేదు' అంటూ ఆక్రోశం, ఆవేదన వెలిబుచ్చింది. 'ఆ రోజు కలెక్టర్ వచ్చిన సమయంలో నా తమ్ముడు అక్కడ లేడు. పనికి పోయిండు. రాత్రి వచ్చి అన్నం తిని పడుకున్నడు. పొద్దుగాల జరిగినవేవీ తనకు తెలియవు. ఒంటిగంట రాత్రి పోలీసులు వచ్చి కరెంట్ బంద్ పెట్టి ఇంట్ల నుంచి పట్టుకపోయింద్రు. ఇయాల్టికి నెలైతాంది. ఎక్కడున్నడో తెల్వది. ఇన్ని ఇబ్బందులు ఎందుకు పెడుతున్నరో! ఓటేసినందుకు ఈ బాధనా? గెలిపించినందుకు ఈ బాధనా? నా తమ్ముడు ఏం నేరం చేసిండు? ఎవరినైనా మర్డర్ చేసిండా?' అని ఆగ్రహం వ్యక్తంచేసింది.

అన్నంపెట్టే రైతుకు బేడీలా?

- అమానవీయ ప్రవర్తన క్షమార్హం కాదు
- హైకోర్టు సీజే సుమోటోగా తీసుకోవాలి
- దీనిపై గవర్నర్ విచారణకు ఆదేశించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

నందినగర్‌లోని తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): గుండెపోటు వచ్చిన అన్నదాతకు బేడీలు వేయడం అమానవీయమని, రేవంత్‌రెడ్డి క్రూర మనస్తత్వానికి ఇది నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గిరిజన రైతు హీర్యానాయక్‌కు గుండెపోటు వస్తే అంబులెన్స్‌లో స్ట్రెచ్చర్‌పై తీసుకురావాల్సింది పోయి పోలీస్ జీపులో నడిపిస్తూ దవాఖానకు తరలించారని మండిపడ్డారు. ఈ దారుణ ఘటన కొత్త క్రిమినల్ చట్టం భారతన్యాయ సంహితతోపాటు పోలీస్ మాన్యువల్స్, జైల్ మాన్యువల్స్ ప్రకారం కూడా అండర్ ట్రయల్ ఖైదీల హక్కులను హరించడమేనని తేల్చిచెప్పారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలని, గవర్నర్ ఈ ఘటనపై విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తిచేశారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో గురువారం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ లగచర్ల ఘటనలో సంగారెడ్డి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు హీర్యానాయక్‌కు బుధవారం గుండెనొప్పి వస్తే వైద్య సాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. హీర్యాకు గుండెపోటు వచ్చిన విషయాన్ని కుటుంబసభ్యులకు, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దవాఖానకు తరలించకుండా, చికిత్స అందించకుండా అమానవీయంగా వ్యవహరించిందని విమర్శించారు. గురువారం ఉదయం హీర్యానాయక్‌కు మళ్లీ గుండెపోటు రావడంతో సంగారెడ్డి జిల్లా దవాఖానకు పోలీస్ జీపులో బేడీలు వేసి తీసుకొచ్చారని మండిపడ్డారు. 'రైతుకు సంకెళ్లు వేసిన ఫొటోలను మీడియాకు చూపించారు. ఇప్పుడు మేము ఒత్తిడి తేవడంతో హైదరాబాద్ తరలిస్తామని చెప్తున్నారు. రైతులు రాఘవేంద్ర, బసవప్ప ఆరోగ్యం కూడా తీవ్రంగా క్షీణించింది. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కూడా అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి' అని ఆవేదన వ్యక్తంచేశారు.

రైతులు జైళ్లలో ఉంటే ముఖ్యమంత్రి విందులా?

గిరిజన రైతులు జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో మగ్గుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జైపూర్‌లో విందులు, వినోదాల్లో జల్సాలు చేసుకుంటున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. గుండెపోటు వచ్చిన అండర్ ట్రయల్ ఖైదీలకు బేడీలు వేసి పోలీస్ జీపులో దవాఖానకు తరలించడం వారి హక్కులను ఉల్లంఘించడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మా సామ్రాజ్యంలో మేము చెప్పిందే నడవాలి. నేను రారాజును అనే అహంకారంతోనే రేవంత్‌రెడ్డి ఆయన సోదరులు గిరిజన రైతుల ప్రాణాలు తీస్తున్నారు' అని కేటీఆర్ నిప్పులుచెరిగారు. కేవలం తన మాట వినలేదన్న ఏకైక కారణంతోనే గిరిజన రైతులపై రేవంత్‌రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.. తప్పు చేయకపోతే ఫ